

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**హైదరాబాదు** బిజినెస్ పనిమీద వచ్చారు సుధీర్ శాంతిలు. వాళ్ళిద్దరికీ ఇప్పుడొక బాబు, పాప వున్నారు,

స్నేహితుడు, తన బిజినెస్ వ్యవహారాలు చూసిపెట్టే లాయరు రాజు, అతగాడి భార్య డాక్టర్ లలితల యింట్లో బస చేశారు.

డాక్టర్ లలిత క్లాసుమేటు, ఆమెకు సోదరుని వంటి అభిమానం కలవాడూ అయిన డాక్టర్ రామచంద్రం, అతని భార్య సుమతి తరచూ లాయర్ రాజు, లలితల ఇంటికి వస్తూంటారు. ఏవయినా ఆపరేషన్ కేసులుంటే డాక్టర్ లలిత, డాక్టర్ రామచంద్రం ఇద్దరూ కలిసి చేస్తారు. అంతే కాదు. తమ వద్దకు వచ్చిన పేషెంట్లను అదనపు పరీక్షల కోసం లలితా నర్సింగ్ హోంకు పంపుతాడు డాక్టర్ రామచంద్రం.

అలాగే తన దగ్గరికి వచ్చిన కొందరు పేషంట్లను అదనపు పరీక్షల కోసం డాక్టర్ రామచంద్రం 'సుమతీ నర్సింగ్ హోం' కు పంపుతుంటుంది డాక్టర్ లలిత.

విజయవాడలో డాక్టర్ లలిత తండ్రి ప్రఖ్యాత లాయరు.. ఆయన స్నేహితుడు డాక్టర్ మురళీధరరావు. మురళీధరరావుగారికి బోలెడంత డబ్బూ, డాక్టరుగా మాంచి ప్రాక్టీసూ పలుకుబడి, వో పెద్ద బంగాళా వున్నాయి. ఒకర్తే కూతురు సుమతి. సుమతి గ్రాడ్యుయేట్.

తన డబ్బును చూచి వచ్చే యువకుడు కాకుండా మాంచి గుణం కల కుర్రాడెవరేనా అల్లుడుగా రావాలని మురళీధర రావుగారి కోరిక, అతగాడు డాక్టరై వుంటే తన తర్వాత తన ప్రాక్టీసు చూచుకుంటాడనీ వుంది.

ఆ సమయంలో లలిత తన క్లాసుమేటు అయిన డాక్టర్ రామచంద్రాన్ని ఆయనగారికి పరిచయం చేసింది.

రామచంద్రం తల్లితండ్రి లేని అనాధ. ఒకగానొక ఉదారుని వాత్సల్యంతో పెరిగాడు. చాలా కష్టాలతో చదువు సాగించాడు. చదువుకు ఎందఱో సాయం చేసారు.

డబ్బు విలువ, జీవితం విలువ తెలిసిన వ్యక్తి. అన్నిటికీ మించిన మంచితనం, మానవత్వం కల వ్యక్తి.

లాయర్ రాజు, డాక్టర్ లలితల వివాహ విషయంలో రామచంద్రం చాలా సాయం చేసాడు. ఆ కృతజ్ఞతా వుంది లలితకు,

మురళీధరరావుకు, రామచంద్రం చాలా చాలా నచ్చాడు. సుమతికీ నచ్చాడు. రామచంద్రాన్ని పెంచిన శేషాచారి గారు చాలా  సంతోషంగా పెళ్లి జరిపించేందుకు ఆశీర్వదించి అనుమతి యిచ్చారు.

పెళ్ళయ్యాక విజయవాడలోనే వుండి పొమ్మని కోరాడు మురళీధరరావు రామచంద్రాన్ని.

రామచంద్రం అగీకరించ లేదు.

“ఇక్కడ మీరున్నారు. మీ పలుకుబడి వుంది. మీ నీడలో నేను పైకి రాలేను. హైదరాబాదులో ప్రాక్టీసు  పెడతాను. నా స్వంతదయిన వ్యక్తిత్వాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించు కుంటాను. మీరు బొత్తిగా ప్రాక్టీసు చేయలేని నాడు నేను సుమతి వచ్చి మీ దగ్గరే వుండి పోతాం” అన్నాడు.

మురళీధరరావుగారు అడ్డు చెప్పలేదు. అల్లుడికీ కూతురికీ హైదరాబాదులో అన్ని సౌకర్యాలు అమర్చారు.

లాయర్ రాజు, డాక్టర్ లలితలు హైదరాబాదులోనే ఉండటంతో రెండు కుటుంబాల మధ్యా అస్తమానూ రాకపోకలు స్నేహమూ వుంది.

ఈ రోజు బొంబాయి నుంచి సుధీర్ శాంతి వచ్చిన సందర్భంగా లాయర్ రాజు డిన్నర్ ఏర్పాటు చేసాడు. సుధీర్ కు హైదరాబాదులో గల బిజినెస్ బ్రాంచికి లాయర్ రాజు ఓ పార్ట్ నర్ కూడా. సుధీర్ కు దూరపు బంధువు కూడానూ. అంచేత బాగా చనువుంది ఇద్దరి మధ్యా.

డిన్నర్ కు డాక్టర్ రామచంద్రం, సుమతి వచ్చారు.

కబుర్లలో 'అహల్య' అని రచయిత్రి కథల మీదా, నవలల మీదా చర్చ వచ్చింది.

"మా శాంతికి ఆవిడ రచనలంటే క్రేజ్! ప్రతి తెలుగు పత్రికా కొని తీరాల్సిందే. ఆ మధ్య ఎవరో ఫ్రెండు చెప్పిందట ఆ అహల్య ఇక్కడ ఉంటోందని. బాంబే నుంచి నేను ప్రయాణం కాగానే తనూ బయల్దేరింది. 'అహల్య'ను చూడాలిట. మాట్లాడాలిట. ఓ రచయిత్రితో అబిమాన పాఠకురాలిగా ముచ్చటించాలట" అన్నాడు సుధీర్ నవ్వుతూ.

"అవును బావా! నీకు క్రికెట్ మాచెస్ పిచ్చిలానే నాకు కథల, నవలల పిచ్చి. నీకు క్రికెట్ ప్లేయర్సులో పెద్ద పెద్ద ప్లేయర్స్ అంతా ఆరాధ్య దైవాలు అన్నట్లుగానే నాకు రచనలు వ్రాసే రచయితలూ, రచయిత్రులూ దేవుళ్ళూ, దేవతలూ. ముఖ్యంగా అహల్య! ఆ పేరే నా కెంతో నచ్చిన పేరు. అరుదుగా కన్పించే పేరు. అందమయిన పేరు" అంది శాంతి.

"ఆవిడ రచనలని విమర్శిస్తూ నేనో మారు జవాబు ఆశించని పెద్ద ఉత్తరమే వ్రాశాను. జవాబు ఇవ్వనవసరం లేదని కూడా వ్రాసాను" అన్నాడు డాక్టర్ రామచంద్రం నవ్వుతూ.

"నిజంగా?" ఆశ్చర్యంగా చూచింది శాంతి.

"అంతగా మీరెందుకు ఆశ్చర్య పోతున్నారో నాకర్థం కావడం లేదు. సాహిత్యాన్ని పక్క మార్గం పట్టించి నందుకు బాధపడుతూ వ్రాశానా ఉత్తరం." ఉత్తరం అంతా అప్పుజెప్పాడు డాక్టరు రామచంద్రం.

మళ్ళీ అన్నాడు. "అయితే ఆమె రచనలలో మార్పు రాలేదు. రాదనీ నాకు తెలుసు. పైగా ఓ మొండి వైఖరి ప్రబలి తన ధోరణిని మరింత ఫోర్సుగా సాగించిందావిడ. నవ్వుకుని ఊరుకున్నాను."

"ఆవిడ ఇంటి అడ్రసు మీకు తెలుసా?" కుతూహలంగా అడిగింది శాంతి

" ఆఁ! మధ్య ఓ పేషంటును చూడ్డానికి వెళ్తుంటే నా కాంపౌండర్ మీ లాటి పాఠకుడు ఒకడు నా రిక్షాలో వున్నాడు. అతగాడు చూపాడు. 'ఇదేనండీ అహల్య గారిల్లు' అని. సర్లే అన్నాను."

"అరె! మీరు దిగి చూడలేదూ?" ఆశ్చర్యంగా అడిగింది శాంతి.

"ఊహుఁ! నా అంత నేనుగా ఎవరినీ కలుసుకొనే స్వభావం, పూసుకు తిరిగే స్వభావం నాకు లేదు."

"పోనీండి. ఆవిడ గారిల్లు పెద్ద బంగళానా? కారుందా?" శాంతి అడిగింది.

"చిన్న ఇల్లే. వాళ్ళు మాలానే మిడిల్ క్లాస్ వాళ్ళని విన్నాను" అన్నాడు రామచంద్రం.

"మీరు మిడిల్ క్లాసా?" అంది సుమతి నవ్వుతూ.

"ఇప్పుడు కాదులే! మీ నాన్న ద్వారా, నీ దయవల్ల లక్షాధిగారిని అయ్యాననుకో." రామచంద్రం నవ్వాడు.

"మా రామచంద్రం పది లక్షలున్నా, లేకున్నా నోట్లు విలువ చేసే వ్యక్తిత్వం వున్న వ్యక్తి" అంది డాక్టరు లలిత.

"బాబోయ్! నీకూ కవిత్వం వస్తోందేమిటి? కత్తులూ కటార్లూ వదిలి కలం పడతావా ఏమిటి?" అన్నాడు రాజు నవ్వుతూ.

"ఇంతకూ ఆ అహల్య గారింటి అడ్రసు సరిగా చెప్పండి. ఇక సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళే ప్రోగ్రాం ఎలాగూ వుంది మాకు. కారు వేసుక అన్ని గల్లీలు తిరక్కుండా, చెబితే నేరుగా వెళతాం. శాంతిని ఆవిడతో ముచ్చటక్కూర్చోబెట్టి నేను రాజు మా బిజినెస్ పనిమీద వెళ్లి పోతాం. నాకు బిజినెస్, డబ్బు తప్ప ఈ కళలూ పాడూ తెలీవు. అవసరం లేదు" అన్నాడు సుధీర్.

"మీ వెంట మా కాంపౌండరు సుబ్బారావు వస్తాడు లెండి. ఇల్లు చూపించి వస్తాడు" అన్నాడు రామచంద్రం.

ఆ సాయంత్రం సుధీరు శాంతి పిల్లలు ఇద్దర్నీ లలితగారి ఇంట్లో వదలి 'అహల్య'ని కలుసుకోవటానికి కారులో వెళ్ళారు.

సరిగ్గా అదే సమయంలో గోపాలరావుతో హోరాహోరి పోట్లాడుతోంది కమల.

"ఈ అర్థం లేని ఖర్చు ఏమిటి కమలా? ఇంటి నిండా రక రకాల సామాన్లు కొని పడేశావ్? అదేమంటే ఇంటికి ఎవరైనా వస్తే గొప్పగా వుండాలంటావ్. రెండువేల రూపాయలు ఖరీదు చేసే ఫారిన్ టేప్ రికార్డరు, మనకిప్పుడు అవసరమా? అదీ అప్పు పెట్టి! మనం ఎవర్ని బ్లాక్ మెయిల్ చెయ్యాలి? ఏం టేప్ చెయ్యాలి? గొప్పకూ హద్దు లేదా? సామానులు ఎక్కువయి, ఇల్లు చాలక ఈ పెద్ద ఇల్లు తీసుకున్నామా? ఇదీ ఇరుకనిపిస్తోంది నీకు. వుండేది ఇద్దరం. మనం ఆర్థిక పరిధిలో మనం బ్రతుకుదాం. ఎవరికోసమో మనం బ్రతుకుతున్నామా?

అదేమంటే నా డబ్బు, నా ఇష్టం అంటావు. ఎప్పుడైనా నా డబ్బునీ, నా కోరికలనీ నేను కేటాయించుకున్నానా? నువ్వు రచయిత్రివి అయినా కాకున్నా, నువ్వే కళాకారిణివీ, ఉద్యోగివీ కాకున్నా, నేను నా భార్యగా నిన్ను, మనకు పుడితే మన పిల్లల్నీ పోషించాల్సిన బాధ్యత వుంది కదా నాకు? ఆ మేరకు నేను నీకు తక్కువ చేస్తున్నదేమిటి?

బ్యాంకి బాలెన్స్ తరిగి పోతోంది. నా ఉద్యోగ కాలం పూర్తయే లోగా, అన్ని సౌకర్యాలతో మనకంటూ వో స్వంత ఇల్లు ఏర్పరచుకుందామని నా ఆశయాన్ని నీకు చెప్పాను.

ఇప్పుడెందుకో రాను రాను నీలో మార్పు వస్తోంది. నా పట్ల వో విధమయిన హేళన, నిరసన మొదలయినాయి.

నీ కీర్తికి నేను అసూయపడటం లేదు. ఆనందిస్తున్నాను. నీ కథలకు, నీ నవలలకు వస్తున్న కొద్దిపాటి పారితోషికంతో నీలో ఆత్మ విశ్వాసం వచ్చిందనీ, ప్రతి స్త్రీకీ ఇలాగే అంతో యింతో 'సంపాదన' అంటూ వుంటే ఆమెకు నిశ్చింతగా ఉంటుందనీ నేనెప్పుడూ ఆలోచిస్తూ ఉంటాను. అలాటప్పుడు, 'నా ఇష్టాలు, నా కోరికలు' అంటూ నీకై నీవు వేరుపడి, నన్ను కేటాయిస్తావెందుకు?

నిజానికి నీ కోరికలని నీవేనాడూ  కొసకంటా తీర్చుకోలేవు. అందుకుగానూ అదనపు అప్పులు, అదీ నాకు తెలియకుండా చేయటాన్ని నేను సమర్థించ లేకుండా వున్నాను.

ప్లీజ్! జరిగింది జరిపోయిందని మర్చి పోదాం. ఇది మనిద్దరి సంసారం. మనిదరం ఈ సంసార రథ చక్రాలం. నీ ఆలోచనలూ, నా ఆలోచనలూ, నీ అభిరుచులూ, నా అభిరుచులూ సమన్వయ పరచుకోవటంలోనూ, పరస్పరం సదవగాహనతో సర్దుకు పోవటంలోనూ సంసారం వో మధురానుభూతిగా సాగుతుంది.

ఉదాహరణకు నా పిలకముడి నీకిష్టం లేదన్నావు. నాకు ఇష్టం లేకపోయినా తీసి వేశాను. నా వ్యక్తిత్వంలో వో భాగంగా ఉంటుండిన నా సాంప్రదాయపు సెంటిమెంటుని నీ ఇష్టం కోసం కత్తిరించి వేశాను.

ప్రాతఃకాలంలో నేను మడిబట్ట కట్టుకుని చేసుకునే పూజా విధానాన్ని నీవు అపరిమితంగా అసహ్యించు కున్నావు. ఆ పూజక్కావలసిన సామగ్రి వగైరా భార్యగా సిద్ధం చేసే బాధ్యత అలా వుంచి, నా పూజ విఘ్నం చేసేందుకు నీ శాయశక్తులా పోట్లాడుతూనే వుండేదానివి. 'ముని'లా ఇదేమిటని వెక్కిరించేదానివి.

నీ తృప్తి కోసం, నా పూజా విధానాన్ని మానసికంగా మార్చుకుని, సంక్షిప్తం చేసుకున్నాను. మా తండ్రి గారి పారంపర్య సాంప్రదాయం ప్రకారం స్త్రీ ఆమె కోడలయ్యేది, కూతురయ్యేది, వివాహానంతరం సంవత్సరం గడిచాక చక్రాంకితాలు (ముద్రాంకితాలు) వేయించుకుని మంత్రోపదేశం పొందాలి.

నీకు ఇష్టం లేదన్నావు. నేను బాధ పడ్డానే గాని భార్యవనే జులుం ప్రదర్శించి నీకు దీక్ష ఇప్పించలేదు.

మరి నా యే మాటా లెక్క చేయ్యవేమిటి?" అన్నాడు గోపాలరావు చాలా బాధగా, ఆవేశంగా.

కమలకీ రోజు చాలా చిరాకుగా వుంది. ఎందుకో సుధీర్ పదే పదే గుర్తుకు వస్తున్నాడు. ఈ ఇరుకు జీవితంలో తను ఇమడలేదు. తన అహరహం కోరుతున్న 'ఇంద్ర భోగం' లాటి జీవితం లభ్యం కావటం లేదు.

ప్రతీదీ వో పరిధిలో ఉండాలనే ఈ భర్తంటే రోజు రోజుకూ ద్వేషం, అసహ్యం ప్రబలుతోంది. అదీరోజు మరింతగా విజ్రుంబించింది.

ఆమె సాకు కోసం చూస్తోంది పోట్లాట కోసం. అలాటి సమయంలో ఆరు షాపుల్లో స్టీలు , పింగాణీ పాత్రల సెట్స్ కు, పట్టు చీరెలకూ, టేప్ రికార్డర్ కు ఏకంగా ఒకేసారి అప్పు... వాయిదాల పద్ధతి పెట్టేసి వచ్చింది కమలని తెలిసిన గోపాలరావు సహనం కోల్పోయాడు.

ఇద్దరూ హోరాహోరీ వాగ్యుద్ధంలో ఉండగానే వాకిటి ముందు పెద్ద పడవలాటి ఇంపాలా కారు ఆగింది.

కారులో తమ ఇంటికి వచ్చే బంధువులెవరూ లేరు. స్నేహితులూ లేరు.

చప్పున గోపాలరావు బయటికి వచ్చాడు ఆగంతకులని ఆహ్వానించటానికి. కమల బాత్ రూం వేపు పరుగెత్తింది. ముఖం సబ్బుతో బాగా కడుక్కుంది.

బాత్ రూంలో నుంచి కిచెన్ లోకి, కిచెన్ లో నుంచి బెడ్ రూం లోకి ప్రవేశం ఉంది ఆ ఇంటికి. అంచేత బెడ్ రూంలోకి వచ్చి గబగబా రేగివున్న జుట్టు సరిచేసుకుని బొట్టు పెట్టుకొని, కట్టుకొని ఉన్న ఓ మోస్తరు వాయిలు చీరె వదిలి కాస్తంత ఖరీదయిన చీరె కట్టుక వచ్చింది.

ఈలోగా గోపాలరావు ఆగంతకులని హాలు అనబడే రూంలో సోఫాలో కూర్చోబెట్టాడు.

"అహల్యగారిని చూడాలని వచ్చాం" అని వాళ్ళు చెప్పటం వల్ల, వాళ్ళు కమల రచనల తాలూకు అభిమానులని తెలిసి పోయింది.

"ఇంతక్రితమే స్నానం చేయటానికి వెళ్ళింది. వస్తుంది వుండండి" అన్నాడు.

సుధీర్ గోపాలరావుని పరిచయం చేసుకున్నాడు. పక్కింటి కుర్రాణ్ణి కేకేసి అతిధులకు కూల్ డ్రింక్స్ పట్టుకు రమ్మని పంపాడు గోపాలరావు.

కమల బెడ్ రూంలోకి వచ్చిన అలికిడి విని, గోపాలరావు లోపలికి వెళ్లి చెప్పాడు.

"నీకోసం వచ్చారు వాళ్ళు. కేవలం నీ మొగుడిగా పరిచయ భాగ్యం కలిగింది నాకు." నవ్వుతూ అన్నాడు.

ఇందాకటి కోపం లేదు ఇద్దరిలోనూ. ఆగంతకుల కారు చూడగానే కోపాలు ఎగిరిపోయి, కర్తవ్యం గుర్తొచ్చింది ఇద్దరికీ.

"చాల్లెండి వేళాకోళం! అహల్య నా భార్య అని చెప్పుకోవచ్చుగా?"

"ఎలా అయితేనేంలే. నువ్వు చప్పున రా" అన్నాడు గోపాలరావు నవ్వుతూ. "లేకుంటే, నన్నో విలన్ గా, సాహిత్యం విలువ తెలీని వెర్రి వెంగళాయిగా ఊహిస్తారో ఏం ఖర్మో వాళ్ళు."

"సర్లెండి. నేనొస్తున్నాను, కేవలం అహల్యగా." నవ్వుతూ అంది కమల.

గోపాలరావు వచ్చి కూర్చున్నాడు. కమల తనని తానొకమారు ఈ మధ్యే కొన్న డ్రెస్సింగ్ టేబిల్ కి ఉన్న నిలువుటద్దంలో చూచుకుంది.

ఈ మధ్య బాగా ఒళ్ళు వచ్చింది. ఆ వెనకటి పీలతనం పోయి, పొడుగుకు తగ్గ లావుతో చాలా చాలా అందంగా వుంది. ఎందరెందరో మెచ్చుకొనే ప్రత్యేకమైన కళ్ళు తనవి.

సుధీర్ అసలా కళ్ళు చూసే ప్రేమించానన్నాడు. ఆ కళ్ళు యింకా అందంగా వున్నాయి యిప్పుడు.

ఒకప్పుడు ఓ ఛాయ తక్కువగా వుండేది తను. కానీ నీడ పట్టున వుండటం, ఓ పేరూ, కాస్తంత డబ్బు, అహం వచ్చాక బాగా తెలుపుగా వుంది. మొత్తం మీద ఎవరు చూచినా...

"ఆహా! చాలా చక్కని యువతీ" అని అప్రయత్నంగా అనే అందం వుంది తనలో.

అయితే యిందాకా ఎవరూ అభిమానులు యిలా తనను పర్సనల్ గా కల్సుకోవటానికి రిక్షాలలో కూడా రాలేదు. ఇప్పుడు ఏకంగా కారులో వచ్చారు.

కాస్తంత దడ వస్తోందామెకు. హఠాత్తుగా కలిగిన ఎక్సైట్ మెంటుతో.

మెల్లిగా నడిచి వచ్చింది.

హాలులో సోఫాలో సుధీర్, శాంతి రూం ద్వారం కేసి చూస్తున్నారు కుతూహలంతో.

గోపాలరావు వీపు రూం ద్వారం కేసి వుంది.

"క్షమించాలి. కొంచం ఆలస్యమైంది." వీణ మీటినట్లున్న కంఠస్వరంతో సభ్యత వుట్టి పడుతుండగా అంటూ రూం ద్వారంలో చేతులు జోడించి దివి నుండి భువికి దిగి వచ్చిన అపురూప లావణ్య రాశిలా నిలబడి వుంది కమల.

"నమస్కారం" అంటూ చేతులు జోడించిన శాంతి, సుధీర్ ఒక్కసారిగా అవాక్కయి పోయారు.

అహల్య ... అహల్య... అహల్య...

జ్ఞాపకాల తెరలు, పుటలు, పరస్పరం కదులాడుతున్నాయి.

సుధీర్ శాంతి... శాంతి సుధీర్

అహల్య కమల... అహల్య కమల.

"కమలా! వీరు సుధీర్, వీరు శాంతి. ఈవిడే నా మిసెస్ కమల. కలం పేరు అహల్య."

రెండు మూడు సెకండ్ల కాలంలో ఆ ముగ్గురి హృదయాలలో, కళ్ళలో చెలరేగిన భావాల వరదలో గోపాలరావు పరిచయ వాక్యాలు పేలవంగా గడ్డిపోచల్లా కొట్టుకు పోయాయి.

"నువ్వా!" శాంతే ముందస్తుగా తేరుకుంది.

సుధీర్ కళ్ళు విభ్రాంతిగా చూస్తున్నాయి కమల వేపు. కాదు అహల్య వేపు.

"ఔను నేనే." నవ్వబోయింది. నవ్వు రాలేదు. శాంతి పెళ్ళికి తను వెళ్ళటం, శాంతి నిర్లక్ష్యం , శాంతి సలహా, సుధీర్ చేతగానితనమో, తప్పించుకునే తత్వమో అతగాడి మౌనం.

"అహల్యగా పేరు మార్చుకున్నావా?" శాంతి అడిగింది. అందాకా రచయిత్రి అహల్య మీద వుండిన అభిమానం ఏ సుదూర తీరాలకో ఎగిరి పోవటం అటుంచి ఆ అభిమానం స్థానంలో ఓ రకమయిన జెలసీ చోటు చేసుకుంది.

ఎందఱో పాఠకుల అభిమానాన్ని చూరగొన్న అహల్య ఆ కమలేనా?

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments